RNI: TELTEL12215
https://youtube.com/@PrabhathasuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

RANGAREDDY, EDITION : 01, VOLUME :183 EDITOR: CHERUKU UPENDAR, DATE : SATURDAY 18 NOVEMBER 2023 PAGES:4 RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 183 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేది : శనివారం 18 నవంబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-

## దాని ఫలితాన్ని మాత్రం కేసీఆర్ ఒక్కరే అనుభవిస్తున్నారు

**మల్లిఖార్జున ఖర్గే**



**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు:** తెలంగాణాలో నవంబర్ 30న ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టో ను విడుదల చేసిన సంగతి తెలిసిందే.. ఈ మేనిఫెస్టో విడుదల చేసిన సందర్భంగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే మాట్లాడుతూ కేసీఆర్ పై

మిగతా 2లో



## డీప్ ఫేక్ వీడియోల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**- ప్రధాని మోడీ**

**హైదరాబాద్- ప్రభాత సూర్యుడు:** ఇటీవల కాలంలో సోషల్ మీడియాలో డీప్ ఫేక్ వీడియోలు విస్తృతంగా దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా సినీ తారల అభ్యంతరకర దృశ్యాలతో ఉన్న డీప్ ఫేక్ వీడియోలు కలకలం రేపుతున్నాయి. వేరొకరి ముఖాల స్థానంలో రష్మిక మందన్న, కాజోల్ వంటి తారల ముఖాలను మార్ఫింగ్ చేసి రూపొందిస్తున్న ఈ వీడియోలు నిజమైనవే అని భ్రమించేలా ఉంటున్నాయి. అంతెందుకు, ప్రధాని నరేంద్ర మోడీ ఓ పాట పాడినట్టు డీప్ ఫేక్ వీడియో రూపొందించడం ఇదెంతటి తీవ్రమైన సమస్యో చెబుతోంది. ఇలాంటి వీడియోలపై సర్వత్ర ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ స్పందించారు. డీప్ ఫేక్ వీడియోలు

మిగతా 2లో



# ధరణి పోర్టల్‌తో... అద్భుత ఫలితాలు


**కరీంనగర్-ప్రభాత సూర్యుడు**

ధరణి పోర్టల్‌తో అద్భుత ఫలితాలు వచ్చాయని.. దళారులు లేకుండా చేశామని బిఆర్ఎస్ అధినేత, తెలంగాణ సీఎం కేసీఆర్ అన్నారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచుకుంటూ ప్రజల అవసరాల కోసం వినియోగి స్తున్నామని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కరీంనగర్‌లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ మాట్లాడారు. ”ఉద్యమ సమయంలో ఆమరణదీక్షకు శ్రీకారం చుట్టింది ఇక్కడే. అలుగునూరు చౌరస్తాలో నన్ను అరెస్ట్ చేసి ఖమ్మం జైల్లో పెట్టారు. అనేక ఘట్టాల్లో కరీంనగర్ గడ్డ ప్రథమస్థానంలో ఉంటూ అద్భుత విజయాన్ని అందించింది. తెలంగాణ ఏర్పడి నపుడు తలసరి ఆదాయం రాష్ట్రం 19-20 స్థానాల్లో ఉండేది. బిఆర్ఎస్ పదేళ్ల పాలన తర్వాత 3.18లక్షల తలసరి ఆదాయంతో ఇప్పుడు దేశంలోనే ప్రథమ స్థానంలో ఉన్నాం. తలసరి విద్యుత్ వినియోగంలోనూ మనమే మొదటి స్థానంలో ఉన్నాం.రాష్ట్రంలో కంటివెలుగు కార్యక్రమం వస్తుందని ఎవరైనా ఊహించారా? రాష్ట్రవ్యాప్తంగా ఉచితంగా కంటి పరీక్షలు చేసి 80లక్షల మందికి కళ్లద్దాలు పంపిణీ చేశాం. సాగునీటిపై గతంలో పన్ను ఉండేది.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక దాన్ని రద్దుచేశాం. ధరణితో మంచి ఫలితాలు వచ్చాయి. దానివల్ల రైతులు గడప దాటకుండా వారి ఖాతాల్లో నగదు జమ చేస్తున్నాం. ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని రాహుల్‌గాంధీ అంటున్నారు. దాన్ని తీసేస్తే రైతుబీమా, రైతుబంధు, ధాన్యం డబ్బులు ఎలా వస్తాయి? పంజాబ్‌ను అధిగమించి ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. ధరణిని తీసేసి దందాలు చేయాలని కాంగ్రెస్ చూస్తోంది” అని కేసీఆర్ విమర్శించారు.

### తెలంగాణ ఇవ్వకుండా కాంగ్రెస్ నేతలు మోసం చేశారు

58 ఏళ్ల పాటు తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ ఇబ్బంది పెట్టిందని ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. కరీంనగర్‌లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ దోకాబాజ్ పార్టీ అని, ఉన్న తెలంగాణను ఊడగొట్టి ఇక్కడి ప్రజలను దశాబ్దాల పాటు ఏడిపించిం దన్నారు. తెలంగాణ ఉద్యమం ప్రారంభ మైనప్పటి నుంచి ఎన్నో విజయాలకు కరీంనగర్ కేంద్ర బిందువుగా ఉందన్నారు. తెలంగాణ ఉద్యమానికి, ప్రజలకు, వ్యక్తిగతంగా తనకు ఎన్నో విజయాలను

మిగతా 2లో



## బొగ్గు బొక్కిన అదానిపై పునర్విచారణ

**న్యూఢిల్లీ-ప్రభాతసూర్యుడు:** అదాని అక్రమాలను ఎంతగా కప్పిపుచ్చాలని మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే, అవి అంతగా బయటకు తన్నుకొస్తున్నాయి.బొగ్గు దిగుమతుల కుంభకోణంలో వేల కోట్ల రూపాయల ప్రజాధనం లూటీకి సంబంధించిన అక్రమాలపై తిరిగి విచారణ ప్రారంభించేందుకు వీలు కల్పించాలని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డిఆర్ఐ) సుప్రీం కోర్టును అభ్యర్థించింది. అదాని సంస్థ బగ్గు దిగుమతుల్లో బిల్లును మ్యానిపులేట్ చేసి అధిక విలువను చూపిందన్న ఆరోపణలపై సింగపూర్ నుంచి సాక్ష్యాధారాలను సేకరించడానికి వీలు కల్పించాలని కూడా డిఆర్ఐ కోరినట్లు రాయిటర్స్ వార్తా సంస్థ ఓ సంచలనాత్మక కథనాన్ని రాసింది. ఈ కేసులో అధికారులను విచారించకుండా దిగువ కోర్టు ఇచ్చిన

మిగతా 3లో

## మెరిసిన మన్వీర్

**కువైట్‌పై 1-0 గోల్స్‌తో భారత్ గెలుపు**
**ఫిఫా ప్రపంచకప్-2026 క్వాలిఫయర్స్ రౌండ్-2**



**కువైట్ సిటీ - ప్రభాత సూర్యుడు :** ఫిఫా ప్రపంచకప్-2026 క్వాలిఫయర్స్ రౌండ్2లో భారతజట్టు సంచలన విజయం సాధించింది. గురువారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో భారత ఫుట్‌బాల్ జట్టు ఆతిథ్య కువైట్ జట్టును చిత్తుచేసింది. జబేర్ అల్-అహ్మద్ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో భారత్ 1-0తో కువైట్‌ను చిత్తుచేసింది. భారత్ తరఫున ఏకైక గోల్‌ను మన్వీర్ సింగ్ 75వ ని.లో చేశాడు. కువైట్ ఆటగాడు ఫసల్ అల్‌హర్బి రెండు ఎల్లో కార్డులకు గురై మైదానాన్ని వీడడంతో ఆ జట్టు మ్యాచ్ ముగిసేవరకు 10మంది ఆటగాళ్లతోనే ఆడింది. భారతజట్టు

మిగతా 2లో



## తెలంగాణ కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో విడుదల

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

తెలంగాణలో కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో విడుదలైంది. 2023, నవంబర్ 30వ తేదీన అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న క్రమంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే.. నవంబర్ ఈ రోజు పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేశారు. హైదరాబాద్ గాంధీ భవన్ లో నిర్వహించిన మేనిఫెస్టో రిలీజ్ కార్యక్రమంలో పాల్గొన్న ఖర్గే.. 'అభయ హస్తం' పేరుతో 42 పేజీల మేనిఫెస్టోను విడుదల చేశారు. ఇప్పటికే ఆరు గ్యారంటీలు, బీసీ డిక్లరేషన్, మైనార్టీ డిక్లరేషన్ లను కాంగ్రెస్ విడుదల చేసిన విషయం తెలిసిందే.

**మ్యానిఫెస్టోలోని ముఖ్యాంశాలివే....**

-- ఏకకాలంలో రూ.2లక్షల పంట రుణమాఫీ
--రూ.3లక్షల వరకు వడ్డీలేని పంట రుణాలు

మిగతా 2లో





## ఆరున్నరేండ్ల బీఆర్ఎస్ పాలనను 65 ఏళ్ల కాంగ్రెస్ పాలనను పోల్చండి

**- బీఎన్ఐ సభ్యులతో కేటీఆర్**

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

ఆరున్నరేండ్ల బీఆర్ఎస్ పాలనను, దాదాపు 65 ఏండ్ల కాంగ్రెస్ పాలనను పోల్చాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కె.టి.రామారావు ప్రజలకు సూచించారు. ఆరున్నరేండ్లలో బీఆర్ఎస్ అందించగలిగింది ఆరు దశాబ్దాల్లో కాంగ్రెస్ అందించలేకపోయిందని తెలిపారు. బిజినెస్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్ (బిఎన్ఐ) సభ్యులతో శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో మంత్రి కేటీఆర్ మాట్లాడారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిదిన్నరేండ్లు అయ్యిందని, అయితే అందులో కోవిడ్ కారణంగా

మిగతా 2లో

## అధికారంలోకి వచ్చిన వెంటనే కుల గణన


**- బిజెపిని కూకటి వేళ్లతో పెకిలిస్తాం - కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ**

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**



రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం, కేంద్రంలో బిజెపిని 2024 ఎన్నికల్లో కూకటి వేళ్లతో పెకిలిస్తామని కాంగ్రెస్ పార్టీ జాతీయ నేత రాహుల్ గాంధీ అన్నారు. తెలంగాణలో ఇకపై బిజెపి కనిపించబోదన్నారు. అధికారలోకి రాగానే కేంద్రంలో కులగణన చేపడ తామని తెలిపారు. బిసిల రిజర్వేషన్ పెంచుతామన్నారు. ఈ ఎన్నికల్లో బిజెపి, బిఆర్ఎస్‌తోనే తమ యుద్ధమని, కాంగ్రెస్ తుపాన్‌లో కెసిఆర్ గల్లంతు కాక తప్పదన్నారు. కెసిఆర్ దోచుకున్న కోట్ల సొమ్ము అంతా పేదలకు పంచుతామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలపై తొలి సంతకం చేస్తామని చెప్పారు. శుక్రవారం భద్రాద్రి కొత్త గూడెం జిల్లా మణుగూరు, వరంగల్ జిల్లా నర్సంపేట, వరంగల్‌లో రోడ్డు షోలు నిర్వహించారు. జైపూర్ నుంచి ఎపిలోని గన్నవరం విమానాశ్రయానికి వచ్చిన రాహుల్ గాంధీ అక్కడి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో మణుగూరుకు చేరుకున్నారు. ఆయా బహిరంగ సభల్లో రాహుల్ మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ ఏమిచ్చిందని కెసిఆర్ అడుగుతున్నారని, తెలంగాణ రాష్ట్రం ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ కాదా అని ప్రశ్నించారు. దేశంలో ప్రధాని మోడీ, రాష్ట్రంలో కెసిఆర్ అబద్ధపు మాటలు మాట్లాడి ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. బిజెపి, బిఆర్ఎస్, ఎంఐఎం అన్నదమ్ముళ్ల వలే కలిసి రాష్ట్రంలో పనిచేస్తున్నాయని ఆరోపించారు. తెలంగాణలో ఇందిరా, రాజీవ్ గాంధీ చేసిన అభివృద్ధి కనబడుతుందని, బిఆర్ఎస్ చేసిందేమీ లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ వల్ల లక్ష కోట్ల రూపాయలు దుర్వినియోగం చేశారని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి

మిగతా 2లో



## భారీ ఎన్‌కౌంటర్.. ఐదుగురు మృతి

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు :** జమ్మూ-కాశ్మీర్‌లో మరోసారి కాల్పుల మోతతో దద్దరిల్లింది. ఇక్కడి కుల్గాం జిల్లాలో ఉగ్రవాదులు, భద్రతా బలగాలకు మధ్య భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. ఈ ఘటనలో మొత్తం అయిదుగురు ఉగ్రవాదులు మృతిచెందారు. మృతులను లష్కర్

మిగతా 2లో

## దాని ఫలితాన్ని మాత్రం కేసీఆర్ ఒక్కరే అనుభవిస్తున్నారు

(మొదటిపేజీ తరువాయి)

ఒక రేంజ్ లో ఫైర్ అయ్యారు. తెలంగాణ కావాలని ఎందరో మహనీయులు పోరాడి తమ ప్రాణాలను అర్పించారు కానీ దాని ఫలితాన్ని మాత్రం కేసీఆర్ ఒక్కరే అనుభవిస్తున్నారని ఖర్గే విమర్శించారు. గత ఎన్నికల్లో కర్ణాటకలో చెప్పిన విధంగానే ఇప్పుడు అయిదు హామీలను అమలు చేస్తున్నాము.. ఇప్పుడు తెలంగాణలోనూ చెప్పిన విధంగా ఆరు హామీలను కేవలం మొదటి 100 రోజుల్లోనే అమలు చేసి తీరుతామంటూ ఖర్గే చాలా ధీమాను వ్యక్తం చేస్తున్నారు. ఈ హామీలను మొదటి సారి కాబినెట్ భేటీ లోనే వాటిని ఆమోదించి తీరుతామంటూ ఖర్గే స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో కేసీఆర్ ను ఓడించి ఫామ్ హౌస్ కు పంపిస్తామంటూ మల్లఖార్జున ఖర్గే నమ్మకంగా మాట్లాడారు.

## తెలంగాణ కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో విడుదల

(మొదటిపేజీ తరువాయి)

--వ్యవసాయానికి 24గంటల నిరంతర ఉచిత విద్యుత్
- ధరణి స్థానంలో భూమాతా లేదా భూభారతి పోర్టల్ ప్రతి రైతుకు భూ ఆధార్‌కార్డు ఇస్తాం
- ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ సకాలంలో నోటిఫికేషన్లు
- సీపీఎస్ రద్దు%ా%పాత పెన్షన్ స్కీమ్ అమలు
- అసంఘటిత కార్మికుల కోసం కార్పొరేషన్
- బీసీలకు 12 కార్పొరేషన్లుతోపాటు వైశ్యులకు సైతం కార్పొరేషన్
- ఎంబీసీలకు ప్రత్యేక కార్పొరేషన్
- అభయహస్తం పునరుద్ధరణ
- విద్యార్థులకు ఉచిత ఇంటర్నెట్ సౌకర్యం
- పోడు భూములకు పట్టాలు
- వికలాంగులకు ఉచిత బస్సు ప్రయాణం, పెన్షన్ రూ.6వేలు
- జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, మెట్రోలో ఉచిత ప్రయాణం, మీడియా కమిషన్ ఏర్పాటు
- ఆరోగ్య శ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంపు దాని పరిధిలోకి మోకాలి సర్జరీ
- ఆర్ఎంపీ, పీఎంపీలకు గుర్తింపు కార్డులు
- ప్రయివేటు విద్యాలయాల్లో భోధన, భోధనేతరులకు ఉద్యోగ భద్రత కోసం ప్రత్యేక జీవో జారీ
- కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ
- గ్రామ పంచాయతీలకు చెరువుల నిర్వహణ, మరమ్మతుల బాధ్యతలు. అందుకోసం తగినన్ని నిధులు
- మెగా డీఎస్సీ ప్రకటించి.. ఆరు నెలల్లో టీచర్ పోస్టుల భర్తీ
- బడ్జెట్‌లో విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయింపు
- మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు నెలకు రూ.10వేల వేతనం
-మూతబడిన దాదాపు 6వేల పాఠశాలలను పున్ణప్రారంభిస్తాం
- కొత్తగా నాలుగు ట్రిపుల్ ఐటీలు ఏర్పాటు చేస్తాం
-ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునికీకరించి మెరుగైన వైద్యం అందిస్తాం
- భూహక్కుల సమస్యల పరిష్కారానికి ల్యాండ్ కమిషన్ ఏర్పాటు
- సర్పంచ్‌ల ఖాతాల్లో గ్రామ పంచాయతీ అభివద్ధి నిధులు జమ
- గామ పంచాయతీ వార్డు మెంబర్లకు నెలకు రూ.1,500 గౌరవ వేతనం
- ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు పెండింగ్ డీఏలు చెల్లిస్తాం
- కొత్త పీఆర్సీ ఏర్పాటు చేసి.. ఆరు నెలల్లో అమలు చేస్తాం
- ఇప్పటికే ఆరు గ్యారంటీలతోపాటు రైతు, మహిళా, మైనార్టీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ల హామీ.

## అధికారంలోకి వచ్చిన వెంటనే కుల గణన

(మొదటిపేజీ తరువాయి)

వస్తే.. ఆరు గ్యారంటీ పథకాల మీదనే తొలి సంతకం పెట్టిస్తా అని తెలిపారు. కాంగ్రెస్‌కు, ముఖ్యంగా ఇందిరా, సోనియా గాంధీలకు తెలంగాణతో.. రాజకీయ సంబంధంతో పాటు కుటుంబ సంబంధం ఉందన్నారు. తెలంగాణ ఏర్పాటులో ఎన్నో సమస్యలు వచ్చినా సోనియా గాంధీ నిర్ణయం తీసుకొని రాష్ట్రాన్ని ఇస్తే.. దాన్ని కెసిఆర్ కుటుంబం దోచుకుంటుందని విమర్శిం చారు. దళిత బంధు పథకంలో ఎమ్మెల్యేలు రూ.మూడు లక్షలు వసూళ్లు చేయడం సిగ్గు చేటన్నారు. బిఆర్ఎస్, బిజెపి స్కీములతో కొంతమందికే లాభం చేకూరుతుందని, అదానికి మోడీ లాభం చేకూరుస్తున్నారన్నారు. భారత్ జోడోయాత్ర సమయంలో ఆర్ఎస్ఎస్, బిజెపి ప్రజలను ఏ విధంగా విభజిస్తున్నాయో అర్థమైందన్నారు. ఇది విద్వేషాలు రగిలించే దేశం కాదని, ప్రేమను పంచే దేశమని తెలిపారు.

## డీప్ ఫేక్ వీడియోల పట్ల అప్రమత్తంగా ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

మన వ్యవస్థకు పెను ముప్పుగా పరిణమిస్తున్నాయని, సమాజంలో గందరగోళానికి దారితీస్తున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. "ఇటీవల తెలిసిన వాళ్లు నాకు ఓ వైరల్ వీడియో పంపించారు. అందులో నేను పాట పాడుతున్నట్టుగా ఉంది. ఏఐ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఈ విధంగా దుర్వినియోగం చేస్తూ డీప్ ఫేక్ వీడియోలు రూపొందిస్తున్నారు. ఇది సమస్యాత్మకమైన అంశం. డీప్ ఫేక్ వీడియోల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఈ తరహా వీడియోలపై మీడియా, పాత్రికేయులు ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రయత్నించాలి. కొత్త పుంతలు తొక్కుతున్న టెక్నాలజీతో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడంపై ప్రజలను సన్నద్ధం చేయాలి" అని మోడీ పిలుపునిచ్చారు. డీప్ ఫేక్ వీడియోలను గుర్తించి, వాటిని ఫ్లాగ్ చేసి హెచ్చరికలు జారీ చేయాలని చాట్ జీపీటీ బృందాన్ని కోరినట్టు మోడీ వెల్లడించారు. ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈ వ్యాఖ్యలు చేశారు

## ఆరున్నరేండ్ల బీఆర్ఎస్ పాలనను
# 65 ఏళ్ల కాంగ్రెస్ పాలనను పోల్చండి

(మొదటిపేజీ తరువాయి)

రెండేండ్లు, వివిధ ఎన్నికల కారణంగా ఒక ఏడాది పోనూ తాము నికరంగా పాలన చేసింది ఆరున్నరేండ్లు మాత్రమే అని తెలిపారు. ఆ కాలంలో అన్ని రంగాలలో అభివద్ధి చేస్తూనే అన్ని వర్గాల సంక్షేమం పథకాలు అమలు చేశామని వివరించారు. కాంగ్రెస్ హయాంలో రాష్ట్రంలో విద్యుత్, నీటి ఎద్దడి తీవ్రంగా ఉండేదనీ, ఒక్కొక్క సమస్య పరిష్కరించామని పేర్కొన్నారు. శాంతి భద్రతలు, మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించి సమర్థవంతమైన పాలన అందించామని చెప్పారు. అంతర్జాతీయ ప్రమాణాలతో హైదరాబాద్ అభివృద్ధి చేశామనీ, దాంతో ప్రఖ్యాత కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెడుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో మూడోసారి బిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సామాజిక మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, క్రీడా మౌలిక సదుపాయాలు, విద్యా, నైపుణ్యం, ఆరోగ్య సంరక్షణ వంటి రంగాలను అభివృద్ధి చేయడంపై దృష్టి పెడతామని కేటీఆర్ తెలిపారు. వచ్చే ప్రభుత్వంలో తనకు పర్యాటక శాఖ కేటాయించమని సీఎం కేసీఆర్‌ను కోరతానని తెలిపారు. తనకు సీఎం, పీఎం కావాలి ఢిల్లీకి వెళ్లాలి అన్న కోరికలు లేవని స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరం అంటేనే తనకు ఇష్టమనీ, తాను ఇక్కడే ఉంటానని ఉద్ఘాటించారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ఆదుకోవడానికి బిఆర్ఎస్ ప్రభుత్వం చర్యలు తీసుకుందని కెటిఆర్ తెలిపారు. అనారోగ్య యూనిట్లు ఒత్తిడి నుండి బయటపడటానికి ఇండిస్ట్రియల్ హెల్త్ క్లినిక్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు.

**మహిళల కోసం సీఎం కేసీఆర్ కొత్త పథకం**

మహిళల కోసం సీఎం కేసీఆర్ కొత్త పథకం తీసుకువస్తున్నారని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. సౌభాగ్యలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రూ.3వేలు ఇస్తామని స్పష్టం చేశారు. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు మూడు వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరి ఖాతాలో రూ. 15 లక్షలు వేస్తామని మోడీ చెప్పారు. మోడీ చెప్పిన రూ. 15 లక్షలు వచ్చిన వారు బీజేపీకి ఓటు వేసుకోవచ్చని ఆయన సూచించారు. రూ. 400 గ్యాస్ సిలిండర్ ను మోడీ రూ. వెయ్యికి పెంచారు. బీఆర్ఎస్ మళ్లీ గెలిస్తే రూ. 400కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని తెలిపారు. రేషన్ కార్డు ఉన్నవాళ్లందరికి రూ. 5 లక్షల జీవిత బీమా అందిస్తామని మంచిర్యాల జిల్లా ఖానాపూర్ నియోజగవర్గం జన్నారంలో ఎన్నికల ప్రచార సభలో కెటిఆర్ పేర్కొన్నారు.

# ధరణి పోర్టల్‌తో అద్భుత ఫలితాలు

(మొదటిపేజీ తరువాయి)

అందించిందని, ఇందుకు కరీంనగర్ గడ్డకు తాను శిరస్సు వంచి నమస్కరిస్తున్నానన్నారు. 2011 మే 17న మొట్టమొదటి సింహగర్జన సభ ఇదే వేదికపై జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రం తీసుకరాకపోయినా, ఉద్యమాన్ని విరమించినా తనను రాళ్లతో కొట్టి చంపండని నాడు ఇక్కడ జరిగిన సభలో చెప్పానని గుర్తు చేశారు. దళితబంధు, రైతుబంధు, రైతు బీమా లాంటి అనేక మంచి కార్యక్రమాలను కరీంనగర్ వేదిక నుంచే ప్రారంభించుకున్నామన్నారు. కాంగ్రెస్ 1969లో ఉద్యమం చేస్తే 400 మందిని కాల్చిచంపిన పార్టీ అన్నారు. 2004లో మనతో పొత్తుపెట్టుకుని రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలోకి వచ్చిందన్నారు. ఆ తర్వాత ఆర్నెల్లకో, ఏడాదికో తెలంగాణ ఇవ్వకుండా కాంగ్రెస్ నేతలు మోసం చేశారన్నారు. పదమూడేళ్లు పోరాడితే కానీ తెలంగాణ రాలేదన్నారు. కాంగ్రెస్ మన పార్టీని చీల్చే ప్రయత్నాలు కూడా చేసిందన్నారు.


దాంతో కేసీఆర్ శవయాత్రనో, తెలంగాణ జైత్రయాత్రనో ఏదో ఒకటి జరగాలని నేను ఆమరణ నిరాహార దీక్ష చేపట్టానని, ఆ దీక్షకు కూడా కరీంనగర్ గడ్డనే వేదిక అయిందన్నారు. తనను అరెస్ట్ చేసి ఖమ్మం జైల్లో పెట్టారన్నారు. కరీంనగర్ ఉద్యమాల గడ్డ అన్నారు. ఒక దేశమైనా, రాష్ట్రమైనా బాగుందా? లేదా? అని చూసేందుకు రెండు కొలమానాలు ఉంటాయని, అందులో ప్రధానమైనది తలసరి ఆదాయం అన్నారు. 2014లో తెలంగాణ ఏర్పడినప్పుడు తలసరి ఆదాయంలో దేశంలో మన ర్యాంకు ఇరవైలో ఉండెనని, కానీ ఇప్పుడు మన తెలంగాణ రూ.3.18 వేల తలసరి ఆదాయంతో దేశంలోనే నెంబర్ 1గా నిలిచిందన్నారు. కడుపు నోరు కట్టుకుని, ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తున్నామన్నారు.


ఇక రెండో గీటురాయి తలసరి విద్యుత్ వినియోగమని, 2014లో తలసరి విద్యుత్ వినియోగం 1,122 యూనిట్లుగా ఉండెనని, ఇప్పుడు 2,040 యూనిట్ల తలసరి విద్యుత్ వినియోగంతో దేశంలో నెంబర్ 1గా ఉన్నామన్నారు.

# మెరిసిన మన్వీర్

(మొదటిపేజీ తరువాయి)

నవంబర్ 21న భువనేశ్వర్‌లో ఆసియా ఛాంపియన్ ఖతార్‌తో రెండో మ్యాచ్‌లో తలపడనుంది. గ్రూప్‌ఏలో ఉన్న భారత్.. ఇదే గ్రూప్‌లో ఉన్న కతార్, కువైట్, ఆఫ్ఘనిస్తాన్‌లతో ఒకోక మ్యాచ్‌లో తలపడనుంది. ఈ గ్రూప్‌లో అగ్రస్థానంలో ఉన్న జట్టు ఫిఫా ప్రపంచకప్-2026 మూడోరౌండ్‌కు అర్హత సాధించనుంది. ఫిఫా ర్యాంకింగ్స్‌లో భారత్ 106వ, కువైట్ 149వ ర్యాంక్‌లో ఉన్నాయి. భారతజట్టు కువైట్‌తో ఈ ఏడాది జులైలో జరిగిన సాఫ్ ఛాంపియన్‌షిప్-2023 ఫైనల్లో షూటౌట్‌లో విజయం సాధించి టైటిల్ నెగ్గిన సంగతి తెలిసిందే.





### ఫైనల్‌కు ముమ్మర ఏర్పాట్లు

- ప్రధాని సహా బిసిసిఐ, దిగ్గజ క్రికెటర్లు హాజరు
- ప్రధాన ఆకర్షణగా వాయుసేన విన్యాసాలు

**అహ్మదాబాద్:** ఐసిసి వన్డే ప్రపంచకప్ ఫైనల్‌కు బిసిసిఐ ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. ఆదివారం భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగే ఫైనల్ మ్యాచ్‌కు ముందు ప్రధాన ఆకర్షణగా వాయుసేన విన్యాసాలను నిర్వహించనున్నారు. ఇందుకోసం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశారు. ముఖ్య అతిథిగా ప్రధాని నరేంద్ర మోడీతోపాటు బిసిసిఐ సభ్యులు, మాజీ క్రికెటర్లు, అన్ని రంగాలకు చెందిన ప్రముఖులు హాజరుకానున్నట్లు సమాచారం. అలాగే దిగ్గజ క్రికెటర్లు కపిల్ దేవ్, సచిన్ టెండూల్కర్, మహేంద్రసింగ్ ధోనీ ఈ మ్యాచ్‌కు హాజరవుతారని సమాచారం. ప్రపంచంలోనే అత్యధిక సీట్ల సమర్థ్యం గల స్టేడియంలో భారత వాయుసేనకు చెందిన సూర్య కిరణ్ ఏరోబాటిక్ బృందం విన్యాసాలు చేయబోతోంది. ఈ విషయాన్ని గుజరాత్‌కు చెందిన డిఫెన్స్ పీఆర్వో ఓ ప్రకటనలో వెల్లడించారు. ఫైనల్ పోరు మొదలయ్యే పది నిమిషాల ముందు స్టేడియంలో ఈ విన్యాసాలు అభిమానులను అలరించనున్నాయి. మొత్తం తొమ్మిది ఎయిర్‌క్రాఫ్ట్‌లు రకరకాల ఆకారాలతో అబ్బురపరచనున్నాయి. ఇందుకోసం శుక్ర, శనివారాల్లో ఎయిర్‌షో రిహార్సల్స్ ఉంటాయని రక్షణ శాఖ పేర్కొంది. ఇక ఫైనల్ మ్యాచ్‌లో మరో ప్రత్యేక కార్యక్రమం కూడా ఉన్నట్లు తెలుస్తోంది. గోల్బల్ పాప్ సింగర్ దువా లిపా ఫైనల్ క్లాష్‌కు ముందు ప్రదర్శన కూడా ఉండనుంది. ఫైనల్లో ఆస్ట్రేలియాతో తలపడే టీమిండియా ఇప్పటికే అహ్మదాబాద్‌కు చేరుకుంది. భారత్, ఆస్ట్రేలియా ప్రపంచకప్ ఫైనల్లో తలపడనుండటం ఇది రెండోసారి. 2003 తుదిపోరులో ఆసీస్ చేతిలో భారత్ ఓడింది. ఇక ఈ ప్రపంచకప్‌లో టీమిండియా మంచి ఫామ్‌లో ఉంది. ఆడిన అన్ని మ్యాచ్‌లు గెలిచిన ఉత్సాహంగా బరిలోకి దిగుతోంది.

# భారీ ఎన్‌కౌంటర్.. ఐదుగురు మృతి

(మొదటిపేజీ తరువాయి)

లష్కర్ తోయిబాకు చెందినవారిగా గుర్తించారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. కుల్గాంలోని సామ్నో ప్రాంతంలో ఉగ్రవాదులు నక్కి ఉన్నారనే సమాచారంతో భద్రతాబలగాలు గురువారం రాత్రి స్థానికంగా తనిఖీలు చేపట్టాయి. ఈ క్రమంలోనే ఉగ్రవాదులు కాల్పులు జరపడంతో భద్రతా బలగాలు ఎదురుకాల్పులు జరిపాయి. అయితే, చీకటి పడటంతో.. పకడ్బందీ నిఘా మధ్య ఆపరేషన్‌కు విరామం ఇచ్చారు. శుక్రవారం తెల్లవారుజామున ఇరుపక్షాల నడుమ మరోమారు కాల్పులు జరిగాయి. మొత్తం 18 గంటలపాటు సాగిన ఈ ఎన్‌కౌంటర్‌లో అయిదుగురు ఉగ్రవాదులను హతమార్చినట్టు అధికారులు వెల్లడించారు. కాల్పుల ధాటికి ఉగ్రవాదులు దాక్కుని ఉన్న ఇల్లు మంటల్లో కాలిపోయిందని, దీంతో వారంతా బయటకు పరుగులు తీశారు.బాకు చెందినవారిగా గుర్తించారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం..



కుల్గాంలోని సామ్నో ప్రాంతంలో ఉగ్రవాదులు నక్కి ఉన్నారనే సమాచారంతో భద్రతాబలగాలు గురువారం రాత్రి స్థానికంగా తనిఖీలు చేపట్టాయి. ఈ క్రమంలోనే ఉగ్రవాదులు కాల్పులు జరపడంతో భద్రతా బలగాలు ఎదురుకాల్పులు జరిపాయి. అయితే, చీకటి పడటంతో.. పకడ్బందీ నిఘా మధ్య ఆపరేషన్‌కు విరామం ఇచ్చారు. శుక్రవారం తెల్లవారుజామున ఇరుపక్షాల నడుమ మరోమారు కాల్పులు జరిగాయి. మొత్తం 18 గంటలపాటు సాగిన ఈ ఎన్‌కౌంటర్‌లో అయిదుగురు ఉగ్రవాదులను హతమార్చినట్టు అధికారులు వెల్లడించారు.

కాల్పుల ధాటికి ఉగ్రవాదులు దాక్కుని ఉన్న ఇల్లు మంటల్లో కాలిపోయిందని, దీంతో వారంతా బయటకు పరుగులు తీశారు.

## సంపాదకీయం

# మళ్లీ తెరపైకి గవర్నర్ వ్యవస్థ

తమిళనాడు, పంజాబ్ రాష్ట్రాల్లో గవర్నర్ వర్సెస్ సీఎంగా పోరు జరుగుతోంది. ఇటీవల పంజాబ్ గవర్నర్ భన్వరీ లాల్ పురోహిత్ వ్యవహార శైలిపై, అక్కడి ఆప్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. గవర్నర్ పురోహిత పలు కీలక బిల్లులకు ఆమోదం తెలపడం లేదని సీఎం భగవంత్ మాన్ సర్కార్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. గవర్నర్లు నిప్పుతో చెలగాలమాడుతున్నారని మండిపడింది. ఈ కేసు విచారణ సందర్భంగా తమిళనాడు వ్యవహారం కూడా సుప్రీం ముందుకు వచ్చింది. అయితే అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసి వారం రోజుల తర్వాత తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి 10 బిల్లులను తిప్పిపంపడం మరోసారి వివాదాస్పదంగా మారింది. ఇప్పటికే ఆ రాష్ట్రంలో గవర్నర్ రవికి, సీఎం స్టాలిన్ అతని పార్టీ డీఎంకేకి పొసగడం లేదు. చాలా సందర్భాల్లో డీఎంకే పార్టీ కార్యకర్తలు గవర్నర్‌కి వ్యతిరేకంగా పలు ప్రాంతాల్లో పోస్టర్లను అంటించారు. గవర్నర్ రవి బిల్లులను వాపస్ చేసిన కొన్ని గంటకే తమిళనాడు అసెంబ్లీ స్పీకర్ ఎం. అప్పావు శనివారం ప్రత్యేక సమావేశానికి పిలుపునిచ్చారు. అయితే ఈ బిల్లులను మరోసారి గవర్నర్‌కి డీఎంకే ప్రభుత్వం తిప్పిపంపాలని భావిస్తున్నట్లు సమచారం. ఇది జరిగితే గవర్నర్ తప్పనిసరిగా సంతకం చేయాల్సి వస్తుంది. బీజేపీ నియమించిన గవర్నర్ ఉద్దేశపూర్వకంగానే ఈ బిల్లల క్లియరెన్స్ లో జాప్యం చేస్తున్నాడని అధికార డీఎంకే పార్టీ ఆరోపిస్తోంది. ఇది ఎన్నికైన ప్రభుత్వాన్ని అణగదొక్కడం అని చెబుతోంది. బిల్లులను తిప్పి పంపండం ద్వారా ఉద్దేశపూర్వకంగానే ప్రజల అభిష్టాన్ని గవర్నర్ దెబ్బతీస్తాయని డీఎంకే ఆరోపిస్తోంది. యూనివర్సిటీల్లో వైస్ ఛాన్సలర్లను నియమించే గవర్నర్ అధికారాన్ని డీఎంకే ప్రశ్నిస్తోంది. గవర్నర్ రవి గతంలో నీట్ పరీక్ష మినహాయింపు బిల్లును వాపస్ చేశారు. రాష్ట్ర అసెంబ్లీ ఈ బిల్లును ఆమోదించిన తర్వాత మాత్రమే దానిని భారత రాష్ట్రపతికి పంపారు. ఆన్ లైన్ గేమింగ్ నిషేధం కోరుతూ వచ్చిన బిల్లుపై కూడా ఇదే వైఖరి అవలంభించారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన రాష్ట్ర ప్రభుత్వాలను తమ పాలనా విధులను నిర్వర్తించనీయకుండా అడ్డుపడుతున్న గవర్నర్ల తీరును రాజ్యాంగపరంగా ఎదుర్కొనేందుకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు దేశ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించవలసి రావడం బిజెపి పాలనలో భారత ఫెడరల్ వ్యవస్థకు పట్టిన దుర్గతిగా భావించవచ్చు. తమ రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులను ఏళ్లతరబడి ఆమోదించకుండా నిలిపివేసిన గవర్నర్ల వైఖరిపై పంజాబ్, కేరళ, తమిళనాడు ప్రభుత్వాలు సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. బిల్లులపై నిర్ణీత గడువులోగా నిర్ణయం తీసుకోవాలని గవర్నర్‌ను ఆదేశించలేమన్న కేరళ హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ బుధవారం ఆ రాష్ట్ర ప్రభుత్వం మరో స్పెషల్ లీవ్ పిటిషన్‌ను దాఖలు చేసింది. గవర్నర్ పరిశీలనకు పంపిన వాటిలో మూడు బిల్లులు ఇప్పటికే రెండేళ్లు పూర్తి కాగా మరో మూడు బిల్లులపై ఏడాదికి పైగా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. తమిళనాడు అసెంబ్లీ ఆమోదించిన 12 బిల్లులను ఆ రాష్ట్ర గవర్నర్ రవి ఆమోదం తెలపకుండా అడ్డుకున్నారు. పంజాబ్ గవర్నర్ భన్వరీలాల్ పురోహిత్ ఏడు బిల్లుల్ని పెండింగ్‌లో పెట్టారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 ప్రకారం శాసనసభ ఆమోదించిన బిల్లులపై గవర్నర్లు సాధ్యమైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలి. ద్రవ్య బిల్లులు మినహా మిగతావాటిని నిలుపుదల (విత్‌హోల్డ్) చేయడం, లేదా రాష్ట్రపతికి పంపడం చేయవచ్చు. నిలుపుదల చేస్తే ఏవైనా సెక్షన్లను సవరించడం గురించి లేదా బిల్లు మొత్తాన్ని పున:పరిశీలించాలంటూ వీలైనంత త్వరగా శాసనసభకు పంపాలి. శాసన సభ అదే బిల్లును తిరిగి ఆమోదించి పంపితే గవర్నర్ తప్పక ఆమోదముద్ర వేయాలని ఈ ఆర్టికల్ స్పష్టంగా పేర్కొంది. అంటే ప్రజల చేత ఎన్నికైన శాసనసభ చేసిన బిల్లులను చట్ట రూపం దాల్చకుండా చేసే హక్కు, అధికారం గవర్నర్‌కు లేవని రాజ్యాంగం తేల్చి చెప్పింది. తెలంగాణ గవర్నర్‌పై ఆ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు, ఆర్టికల్ 200ని ప్రస్తావించింది. 'సాధ్యమైనంత త్వరగా' అనేది రాజ్యాంగపరంగా చాలా ముఖ్యమైనదనీ, రాజ్యాంగబద్ధంగా ఉన్నవారు ఆ విషయాన్ని మరచిపోకూడదని సుప్రీంకోర్టు పేర్కొన్న విషయం తెలిసిందే. బిల్లులపై నిర్ణయం తీసుకోవడంలో గవర్నర్ ఉద్దేశపూర్వకంగా జాప్యం చేయడం వల్ల శాసనసభకు, ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. రాజ్యాంగాన్ని ఉల్లంఘించే విధంగా వ్యవహరించే గవర్నర్లకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 361 రక్షణకు అర్హత లేదని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. పంజాబ్, కేరళ, తమిళనాడు ప్రభుత్వాల కేసు విచారణ సందర్భంగా గవర్నర్లు ఎన్నికైన ప్రజా ప్రతినిధులు కారంటూ భారత ప్రధాన న్యాయమూర్తి చేసిన వ్యాఖ్య ఎంతో అర్ధవంతమైనది.. శాసన, పరిపాలన, న్యాయ వ్యవస్థల మధ్య అధికార పరిధులను రాజ్యాంగమే స్పష్టంగా నిర్దేశించింది. వాటి మధ్యగల లక్ష్మణ రేఖను ఉల్లంఘిస్తే సరి చేయవలసిన విద్యుక్త ధర్మం న్యాయ వ్యవస్థపైనే ఉంది. ఆ ధర్మాన్ని సర్వోన్నత న్యాయస్థానం నిర్వర్తిస్తుందని విశ్వసిద్దాం.

## బొగ్గు బొక్కిన
# అదానిపై పునర్విచారణ

(మొదటిపేజీ తరువాయి)

ఉత్తర్వులను రద్దు చేయాలని డిఆర్ఐ సుప్రీంను కోరింది. అదానీ అక్రమ లావాదేవీలకు పాల్పడినట్లు డిఆర్ఐ అనుమానం వ్యక్తం చేసింది. ఇందుకు సంబంధించిన ఆధారాలను, పత్రాలను సేకరించకుండా భారత్, సింగపూర్‌లో అటు న్యాయపరంగా, ఇటు ఒత్తిళ్ల ద్వారా పదే పదే అడ్డుకునే యత్నాలు జరిగినట్లు ఆధారాలున్నాయని రాయిటర్స్ పేర్కొంది. బొగ్గు అక్రమాలపై విచారించడానికి సింగపూర్‌లో సాక్ష్యాలను సేకరించడానికి ఇంతక్రితం ముంబయి హైకోర్టు నిరాకరించింది. దీన్ని సవాల్ చేస్తూ కొన్ని రోజుల క్రితం డిఆర్ఐ సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

# ప్రజా సంక్షేమమే బిజెపి ప్రధాన లక్ష్యం


## ఎన్నికల ప్రచారంలో నోముల దయానంద గౌడ్ - ఇబ్రహీంపట్నంలో బిజెపి జెండా ఎగురవేద్దాం

**మంచాల - ప్రభాత సూర్యుడు:** శాసనసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఇబ్రహీంపట్నం మండలంలోని, రాయపోల్ , మందగూడ , దొండ గూడ, ముకునూరు, దండు మైలారం, నెర్రపల్లి , జాజోన్ బాయి, మాన్యగూడ, పోల్కంపల్లి , ఎంగేల్ గూడ, నాగన్ పల్లి, గ్రామాల్లో శుక్రవారం బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి నోముల దయానంద గౌడ్ పార్టీ శ్రేణులతో ఆయా గ్రామాలలో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నోముల దయానంద్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలన రౌడిరాజ్యమని, కర్ఫ్యూల రాజ్యమని, కాంగ్రెస్ కి ఓటువేస్తే భయాందోళనలతో బతకాల్సివస్తుందని అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థిని స్థానిక గ్రామాల ప్రజలే తిరగబడి తరిమికొడుతున్నారని అన్నారు. ప్రజల్లో చైతన్యం వచ్చిందని బీఆరెస్ అక్రమాలను అర్థం చేసుకున్నారని, ప్రజలే బీఆర్ ఏస్ పార్టీకి చరమ గీతం పాడుతారని అన్నారు. భారతీయ జనతా పార్టీ అభ్యర్థి అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే నోముల దయానంద్ గౌడ్ కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని తెలిపారు. గత 10 సంవత్సరాలుగా తెరాస ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి పేద ప్రజలకు ఒక తెల్ల రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, కనీసం అర్హులైన వారికి పెన్షన్లు కూడా ఇవ్వడం లేదని అన్నారు. అన్ని అపార్టీలకు అవకాశం ఇచ్చామని ఈసారి బిజెపికి అవకాశం ఇద్దామని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి బూత్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, మండల నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# మరోసారి బిఆర్ఎస్ పార్టీని.. మంచిరెడ్డి కిషన్ రెడ్డిని గెలిపిద్దాం

- ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బొర్ర రమేష్(టిల్లు)
- తెలంగాణ అభివృద్ధిని ముందుకు నడిపిద్దాం
- కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలను నమ్మం అంటున్న ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ప్రజలు
- డబ్బులకు,నోట్ల కట్టలకు అమ్ముడుపోయే వాళ్ళం కాదు మేము గులాబీ జెండా సైనికులం
- కారు గుర్తుకే ఓటేద్దాం మంచిరెడ్డి కిషన్ రెడ్డి ని గెలిపిద్దాం



**ఇబ్రహీంపట్నం- ప్రభాత సూర్యుడు:** దేశంలో ఎక్కడ లేని సంక్షేమ పథకాలను తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ జీవితాల్లో వెలుగులు నింపారని ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బొర్ర రమేష్ (టిల్లు) ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ (టిల్లు) మాట్లాడుతూ రైతుబంధు,రైతు బీమా, దళిత బంధు,బీసీ బంధు, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, అమ్మఒడి, ఆరోగ్యలక్ష్మి, గృహలక్ష్మి, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లాంటి పథకాలు అమలు చేస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తున్నదని తెలిపారు. కాంగ్రెస్ ఓట్ల రాజకీయం చేస్తున్నదని,అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అమలు చేయని పథకాలను తెలంగాణలో అమలు చేస్తామని అసత్యపు ప్రచారాలు చేస్తున్నారని ప్రజలు ఇది గమనించాలని కోరారు. 6 గ్యారంటీలు కాదు 60 గ్యారంటీలు పెట్టినా చెయ్యికి ఓటు వేసే పరిస్థితి లేదని,ముఖ్యమంత్రి కేసీఆర్ తోనే సంక్షేమ పథకాల అమలు సాధ్యమవుతుందని ప్రజలు నమ్ముతున్నారని ఈ సందర్భంగా తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ మరోసారి అధికారం చేపట్టగానే గిరిజన బంధు,తెల్ల రేషన్ కార్డు గల ప్రతి ఒక్కరికి సన్నబియ్యం అందించడంతో పాటు ఐదు లక్షల రూపాయల బీమా సౌకర్యం అందుతుంది అన్నారు. 400 రూపాయలకే గ్యాస్ సిలిండర్ అందిస్తాము,ఆసరా పింఛన్లను ఐదువేలకు, వికలాంగుల పింఛన్లు 6000 రూపాయలకు పెంచుకుంటున్నామని,రైతు బీమా తరహాలో 59 ఏండ్లలోపు కుటుంబ యజమాని చనిపోతే కారణాలతో సంబంధం లేకుండా ఎల్ ఐ సి నుంచి 5 లక్షలను నేరుగా ఆ కుటుంబానికి అందుతుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ మోస పూరిత మాటలు నమ్మి ఆగం కావద్దని వివరించారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్ రెడ్డి కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని రమేష్ (టిల్లు) పిలుపునిచ్చారు.

# కాంగ్రెస్‌కు డిపాజిట్ గల్లంతు

## రోడ్‌షోలో మంత్రి హరీశ్‌రావు

**జగదేవపూర్ - ప్రభాత సూర్యుడు :** ఎన్నికల్లో బీజేపీ డకౌట్ అవుతుంది.. కాంగ్రెస్‌కు డిపాజిట్లు దక్కవని మంత్రి హరిశ్‌రావు అన్నారు. శుక్రవారం మర్కుక్, జగదేవపూర్‌లో నిర్వహించిన రోడ్‌షోలో మంత్రి ప్రసంగించారు. బీఅర్ఎస్‌పై బూతులు మాట్లాడుతున్న వాళ్ళకు 30న పోలింగ్ బూత్‌లలో బీఆర్ఎస్‌కు ఓటు వేసి బుద్ధి చెప్పాలన్నారు. బీజేపీ, కాంగ్రెస్ వాళ్లను గెలిపిస్తే సీఎం కేసీఆర్ హయాంలో వేసిన రోడ్లు, నిర్మించిన భవనాలకు రంగులేయడానికి కూడా పనికిరారని ఎద్దేవా చేశారు. రానున్న రోజుల్లో సౌభాగ్యలక్ష్మి పథకం ద్వారా అర్హులైన పేద మహిళలకు ప్రతి నెలా రూ. 3వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కోటి మంది రైతులకు బీమా పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. కరోనా కష్టకాలంలో మీ వెంట నడిచిన నాయకులు గులాబీ నాయకులని చెప్పారు. ఏ ఒక్క నాయకుడూ ప్రజలను పలకరించిన పాపాన పోలేదని, ఎన్నికలు రాగానే వచ్చి హామీలు



ఇవ్వడం సిగ్గుచేటని విమర్శించారు. ఆ పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అమలు చేయని పథకాలు తెలంగాణలో ఎలా నెరవేరుస్తారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మెన్ ప్రతాప్ రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మెన్ భూంరెడ్డి, డీసీసీబీ చైర్మెన్ చిట్టి దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# ప్రజల కష్టాలు తీర్చడానికే కాంగ్రెస్ 6 గ్యారెంటీలు

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు:** పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్.. ఇచ్చిన హామీలు ఏ మేరకు నిలబెట్టుకుందనే విషయాన్ని ప్రజలు ఆలోచించాలని పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కోరారు. కొడంగల్‌ను దత్తత తీసుకుంటామని.. నీళ్లు తీసుకొస్తామని చెప్పిన నేతలు.. అలాగే చేశారా? అని ఆయన నిలదీశారు. కొడంగల్ నియోజకవర్గంలోని బొమ్రాస్‌పేట్‌లో నిర్వహించిన రోడ్ షోలో పాల్గొన్న రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. "కాంగ్రెస్ హయాంలోనే ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చాం.. రోడ్లు వేశాం. ఈ పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో పేదల కోసం చేసిందేమీ లేదని ఇప్పుడొచ్చి కేసీఆర్ మళ్లీ మనల్ని ఓట్లు అడుగుతున్నారు. మందుపోయాలి, ఓటుకు రూ. 10 వేలు ఇవ్వాలనేదే వారి ఆలోచన. రూ. లక్షల కోట్లు సంపాదించుకోవడమే బీఆర్ఎస్ నేతల లక్ష్యం. కేసీఆర్.. బంగారు తెలంగాణలో పేదలకు ఎంత బంగారం పంచారు? బంగారు తెలంగాణ సంగతి దేవుడెరుగు.. ఉన్న బంగారాన్ని అమ్ముకునే పరిస్థితి దాపరించిందని అన్నారు. ప్రజలు కష్టాలు అర్థం చేసుకున్నాం కాబట్టే తెలంగాణలో మరోసారి ఇందిరమ్మ రాజ్యం తీసుకురావాలని నిర్ణయించాం. అందుకే 6 గ్యారంటీలు ప్రకటించాం" అని రేవంత్ రెడ్డి తెలిపారు.






## డిసెంబరు 4 నుంచి 11 వరకు
# బ్యాంకుల సమ్మె : ఏఐబీఈఏ

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

డిసెంబరు నెలలో దేశవ్యాప్త సమ్మెకు దేశంలోని పలు బ్యాంకులు సిద్ధ మవుతున్నాయి. దీంతో బ్యాంకింగ్ సేవలపై ప్రభావం పడే అవకాశం ఉంది. డిసెంబరు 4 నుంచి 11 వరకు బ్యాంకు ఉద్యోగుల సమ్మె జరగనుంది. ఈ మేరకు అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. రెండు లక్షల ఉద్యోగాలను భర్తి , బ్యాంకుల్లో ఔట్ సోర్సింగ్ సిబ్బందికి స్వస్తి అనే ప్రధాన డిమాండ్లతో ఉద్యోగ సంఘాలు సమ్మెకు దిగనున్నాయి. ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిా అసోసియేషన్ (ఏఐబీఈఏ) నోటిఫికేషన్ ప్రకారం ప్రభుత్వ, ప్రైవేట్ రంగ పలు బ్యాంకులు సమ్మెలో భాగం కాను న్నాయి. డిసెంబర్ 4 - 11 వరకు బ్యాంకుల వారీగా సమ్మె కొనసాగుతుంది. బ్యాంకుల్లో తగినంత శాశ్వత సిబ్బందిఉండేలా చర్యలు తీసుకోవాలని ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి. బ్యాంకు ఉద్యోగాల అవుట్‌సోర్సింగ్ వల్ల దిగువ స్థాయిలో రిక్రూట్‌మెంట్‌ను తగ్గించడమే కాకుండా కస్టమర్ల గోప్యత , వారి డబ్బు ప్రమాదంలో పడే అవకాశం ఉందని ఏఐబీఈఏ ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటాచలం పేర్కొన్నారు. సమ్మెలో పాల్గొనే బ్యాంకుల వివరాలను ఆయన ట్విటర్‌లో షేర్ చేశారు. డిసెంబరు 4న ఎస్బీఐ, పీఎన్బీ, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్ సమ్మె చేయనున్నాయి. అలాగే డిసెంబరు 5న బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, డిసెంబరు 6న సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్ ఉద్యోగులు సమ్మెను పాటిస్తారు. అలాగే డిసెంబరు 7న యూకో బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, డిసెంబరు 8న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, డిసెంబరు 11న ప్రైవేటు బ్యాంకుల ఉద్యోగులు సమ్మెకు దిగనున్నారు.

# విశాఖలో టీమిండియా-ఆసీస్ టీ20..
### - ప్రారంభమైన టికెట్ల అమ్మకం





విశాఖ - ప్రభాత సూర్యుడు

ఈ నెల 23న విశాఖలోని మధురవాడ స్టేడియంలో టీమిండియా, ఆస్ట్రే లియా జట్లు టీ20 మ్యాచ్ లో తలపడనున్నాయి. ఈ మ్యాచ్ కోసం నేడు ఆఫ్ లైన్ విధానంలో టికెట్ల అమ్మకం ప్రారంభమైంది. ఈ ఉదయం 10 గంటల నుంచి టికెట్ల అమ్మకం షురూ చేశారు. మధురవాడ స్టేడియంతో పాటు మున్సిపల్ స్టేడియం, గాజువాక ఇండోర్ స్టేడియంలోనూ టికెట్ల అమ్మకాలు జరుగుతున్నాయి. రూ.600, రూ.1500, రూ.2000, రూ.3000, రూ.3500 ధరల శ్రేణిలో టికెట్ల విక్రయాలు చేపట్టారు. వరల్డ్ కప్ ముగిశాక టీమిండియా, ఆసీస్ మధ్య 5 మ్యాచ్ ల టీ20 సిరీస్ జరగనుంది. ఈ సిరీస్ లోని తొలి మ్యాచ్ కు విశాఖ ఆతిథ్యమిస్తోంది. నవంబరు 23 నుంచి డిసెంబరు 3 వరకు సిరీస్ జరగనుంది.

# సీతమ్మ పండుగ
# గిరిజనుల సాంప్రదాయ పండుగ
### - బిఎన్నార్ ట్రస్ట్ చైర్మన్ బిలకంటి శేఖర్ రెడ్డి

యాచారం - ప్రభాత సూర్యుడు



యాచారం మండల నంది వనపర్తి అనుబంధ గ్రామమైన బొల్లిగుట్ట తండా లో సీతమ్మ పండుగకు ముఖ్యఅతిథిగా బిఎన్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బిలకంటి శేఖర్ రెడ్డి పాల్గొని అమ్మవారికి పూలమాలవేసి ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఈ సందర్భంగా శేఖర్ రెడ్డి మాట్లాడుతూ గిరిజనులు సీతమ్మ పండుగను సాంప్రదాయంగా భక్తిశ్రద్ధలతో, దీప, దూప, నైవేద్యాలతో కొలు స్తారు. అమ్మవారి అనుగ్రహం వల్ల తండావాసులు సుఖ సంతోషాలతో ఆయు రారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో పంది సుధాకర్, ముచ్చర్ల వెంకటరమణ, మేకం శంకర్, కారోబార్ నూక మహేందర్, ములి విష్ణు, ముచ్చర్ల రాఖీ, తండావాసులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో జర్నలిస్టుల అంశాలు
### - టీపీసీసీకి డీజేహెచ్ఎస్ కృతజ్ఞతలు

హైదరాబాద్- ప్రభాత సూర్యుడు

డెక్కన్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ (డీజేహెచ్ఎస్) విన్నపం మేరకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) తన ఎన్నికల మ్యానిఫెస్టోలో జర్నలిస్టుల ఇంటి స్థలాల అంశాన్ని పొందుపరిచిందని ఆ సొసైటీ తెలిపింది. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. అంతే కాకుండా జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం, ఉచిత వైద్య సౌకర్యం అంశాలను మ్యానిఫెస్టోలో పొందు పరచడం శుభ పరిణామమని తెలిపారు. జర్నలిస్టులు కోరుతున్న ప్రధాన డిమాండ్లను సాధించేందుకు పీసీసీ మ్యానిఫెస్టో మరింత బలాన్ని ఇచ్చినట్ట యిందని పేర్కొన్నారు. మ్యానిఫెస్టోలో జర్నలిస్టుల అంశాలను పొందు పరి చి నందుకు టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డికి, మ్యానిఫెస్టో కమిటీ చైర్మెన్ దుద్దిల్ల శ్రీధర్ బాబుకు, సీఎల్పీ నాయకులు భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపింది.

# గడపగడపకు బిఆర్ఎస్ పార్టీ ప్రచారం

-ప్రతి ఇంటికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధి
-మంచిరెడ్డి కిషన్ రెడ్డినే గెలిపించుకోవాలి
- బిఎన్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బిలకంటి శేఖర్ రెడ్డి



యాచారం - ప్రభాత సూర్యుడు

యాచారం మండల పరిధిలోని నంది వనపర్తి గ్రామంలో రాబోయే ఎన్నికల్లో భాగంగా గడపగడపకు ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ సందర్భంగా బిలకంటి శేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం నుంచి పోటీ చేస్తున్న బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మంచిరెడ్డి కిషన్ రెడ్డిని గెలిపించుకోవాలన్నారు. కెసిఆర్ ప్రభుత్వం చేపట్టిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్, రైతుబంధు, ఆసరా పింఛన్లు, సీఎం రిలీఫ్ ఫండ్, కెసిఆర్ కిట్టు, అమ్మ ఒడి, పథకాలు ప్రతి ఇంటికి ప్రతి కుటుంబాలు లబ్ది పొందాయి. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంని అభివృద్ధి దిశలో నడిపిస్తున్న అభివృద్ధి ప్రదాత మంచిది కిషన్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉదయశ్రీ రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ రాజ్ నాయక్ ,ఉపసర్పంచ్ గోవర్ధన్ రెడ్డి, బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు పంది సుధాకర్, ప్రధాన కార్యదర్శి గౌర శేఖర్, సింగిల్ విండో డైరెక్టర్ కొండాపురం శ్రీశైలం, మేకం శంకర్, కారోబార్ నూకం మహేందర్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.






## బిఆర్ఎస్ పార్టీలో చేరిన
# ఆరుట్ల గ్రామం టిడిపి, కాంగ్రెస్ నాయకులు

బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మంచిరెడ్డి కిషన్ రెడ్డి



మంచాల :- ప్రభాత సూర్యుడు

మంచాల మండల పరిధిలోని ఆరుట్ల గ్రామానికి చెందిన టిడిపి, కాంగ్రెస్, పార్టీ జిల్లా నాయకులు కొంగరి శేఖర్ రెడ్డి, నూకం రాజు ముదిరాజ్, పూజారి కృష్ణ ముదిరాజ్, మహమ్మద్ ఆబేద్, బోద్రమోని అంజయ్య ముదిరాజ్, బండి కాడి స్వామి, మహమ్మద్ సాహిద్, చిందం ఐలయ్య కురుమ, దాసరమోని లింగ, ముదిరాజ్, జిలమోని ప్రభాకర్ ముదిరాజ్, బిఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై మంచిరెడ్డి కిషన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులను చూసి మంచి రెడ్డి కిషన్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మంచాల మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చీరాల రమేష్, మాజీ పిఎసిఎస్ మొద్దు సికిందర్ రెడ్డి, మాజీ మంచాల ఎంపీపీ మంకు ఇందిరా, జిల్లా నాయకులు కందల శ్రీశైలం, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ జానీ భాష, బిఆర్ఎస్ పార్టీ ఆర్క గ్రామ శాఖ అధ్యక్షులు పున్నం రాము, జిఎం పిఎస్ చైర్మన్ చిందం జంగయ్య, కొంగరి సత్తిరెడ్డి, చింతపట్ల రమేష్ గౌడ్, ఆర్ల రవి, గడ్డం అశోక్ గౌడ్, ముద్దమొని శ్రీనివాస్ గౌడ్, మొద్దు నరేందర్ రెడ్డి, మధుకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలకు శాపంగా మారిన
# పోషకాహార లోపం
### - అపోలో ఆస్పత్రి జేఎండీ సంగీతా రెడ్డి



హైదరాబాద్- ప్రభాత సూర్యుడు

పిలల్లకు పోషకాహార లోపం శాపంగా మారిందని అపోలో అస్పత్రుల డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతా రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని ఆస్కీలో ఆరోగ్య సమానత్వం..ఇండియాస్ మూన్స్ అనే అంశంపై ఏర్పాటు చేసిన డాక్టర్ చంద్రమౌళి మెమోరియల్ లెక్చర్ లో ఆమె కీలక ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల ఆరోగ్య సమానత్వం అనేది నేడు పెద్ద సవాలుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు.. ప్రపంచ వ్యాప్తంగా 50 శాతం మంది పిల్లలు పోషకాహార లోపంతో బాదపడుతున్నారని, ఇండియాలో ఈ సంఖ్య 51 శాతం ఉందని అన్నారు. స్వచ్ఛమైన తాగునీరు, పారిశుద్యం, ఆరోగ్య సంరక్షణపై దృష్టి పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్కి ఇన్‌చార్జి డైరెక్టర్ జనరల్ నిర్మలా బగాచి, రిటైర్ట్ ఐఏఎస్ అధికారి డాక్టర్ పద్మనాభం, డాక్టర్ నాగభూషణం పాల్గొన్నారు.

# ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్య

- ఇటీవల విధుల నుంచి తొలగింపు
-డీఎం వేధింపులతో మనస్తాపం
- కుటుంబ సభ్యుల ఆరోపణ

జహీరాబాద్ - ప్రభాత సూర్యుడు

ప్రమాదానికి కారణమయ్యాడన్న కారణంతో ఇటీవల విధుల నుంచి తొలగించబడిన ఆర్టీసీ డ్రైవర్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాదకర ఘటన జహీరాబాద్ పట్టణంలో శుక్రవారం జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని ఖాసీంపూర్ గ్రామానికి చెందిన నర్సింలు స్థానిక ఆర్టీసీ డిపోలో పర్మినెంట్ డ్రైవర్‌గా విధులు నిర్వహించేవాడు. రెండు నెలల కిందట నర్సింలు డ్రైవింగ్ చేస్తున్న బస్సు లింగంపల్లి వద్ద రోడ్డు ప్రమాదానికి గురైంది. దాంతో వాహనాల ధ్వంసంతోపాటు పలువురికి గాయాలయ్యాయి. ఈ కేసులో బస్సు డ్రైవర్‌గా ఉన్న నర్సింలును నిందితుడిగా తేల్చి.. ఈనెల 9న సర్వీస్ నుంచి తొలగించారు. ఈ నేపథ్యంలో 'కుటుంబ పోషణ భారం అవుతుంది.. నేను ఎలా బతకాలి' అంటూ నర్సింలు కుటుంబ సభ్యుల వద్ద పలుమార్లు వాపోయాడు. ఆ క్రమంలోనే శుక్రవారం జహీరాబాద్ పట్టణంలోని రైల్వేలైన్‌పై పడుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా డీఎం సూర్యనారాయణ కక్ష సాధింపు చర్య వల్లే నర్సింలు ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబీకులు ఆరోపించారు.

# కాంగ్రెస్‌కు కృతజ్ఞతలు
### - దళిత క్రైస్తవుల ఎస్సీ రిజర్వేషన్ సాధన సమితి

హైదరాబాద్- ప్రభాత సూర్యుడు

దళిత క్రైస్తవుల సంక్షేమం కోసం తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినందుకు కాంగ్రెస్ పార్టీకి దళిత క్రైస్తవుల ఎస్సీ రిజర్వేషన్ సాధన సమితి కృ తజ్ఞతలు తెలిపింది. ఈ మేరకు ఆ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు నాగళ్ల పోచయ్య ఒక ప్రకటన విడుదల చేశారు. దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలనే డిమాండ్ దశాబ్దాల తరబడి పెండింగ్ లో ఉందని గుర్తుచేశారు. దీంతో దళితులు మతస్వేచ్ఛ కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215